క్లుప్తంగా

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మంగళవరపుపేటలో పోషకాహార వారోత్సవ ర్యాలీ

మునగపాక : మహిళలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని పాటిపల్లి మహిళా పోలీసు ఎస్కే బేగం సూచించారు. పాటిపల్లి శివారు మంగళవరపుపేటలో మంగళవారం పోషకాహార వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. బాలింతలు, గర్భిణులతో ప్రతిజ్ఞ చేయించారు. పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్ బి.నాగమణి పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల ఎంపిక పూర్తి

కోటవురట్ల : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టులకు మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ పి.కొండబాబు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఖాళీగా ఉన్న జీఎఫ్‌సీ, ఎంపీహెచ్‌డబ్ల్యు కోర్సులకు అతిథి అధ్యాపకుల కోసం ఇంటర్వ్యూ నిర్వహించగా ఆరుగురు అభ్యర్థులు హాజరయ్యారని, ప్రతిభ ఆధారంగా జీఎఫ్‌సీకి ఎం.రాంబాబు, ఎంపీహెచ్‌డబ్ల్యు కె.ఉమాదేవిని ఎంపిక చేసినట్టు తెలిపారు. నియామక ప్రక్రియలో త్రీమెన్ కమిటీ సభ్యులుగా ప్రిన్సిపాల్స్ వెంకటేశ్వరరావు, జి.చిన్నారావు, పి.కొండబాబు వ్యవహరించినట్టు తెలిపారు.

నేత్రదానంపై అవగాహన ర్యాలీ



రాంబిల్లిలో నేత్రదానంపై అవగాహన ర్యాలీ

రాంబిల్లి : మండల కేంద్రం రాంబిల్లిలో మంగళవారం నేత్రదానంపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. రాంబిల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి అమృతసాయి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో మరణ అనంతరం నేత్రదానం చేయాలన్నారు. నేత్రదానంతో మరొకరికి చూపు సాధ్యపడుతుందన్నారు. సీజనల్ వ్యాధులపై డాక్టర్ అమృతసాయి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల్ని అర్హులందరూ పొందాలి



కొత్తగా మంజూరైన పింఛన్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ లంక సూరిబాబు

పాయకరావుపేట : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెడుతున్న అనేక సంక్షేమ పథకాల్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ లంక సూరిబాబు అన్నారు. పట్టణంలో గల 5వ సచివాలయ పరిధిలో కొత్తగా మంజూరైన సామాజిక పింఛన్లను ఆయన మంగళవారం కొత్తగా మంజూరైన పింఛను సొమ్మును, పింఛను పుస్తకాలను లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో లీడ్ క్యాప్ డైరెక్టర్ వేమగిరి కళ్యాణి లక్ష్మణరావు, పార్టీ పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు డి.నానాజీ, పంచాయతీ వార్డు సభ్యులు పల్లా ప్రసాద్, తుమ్మలపల్లి సతీష్, తాటిపాక నూకరత్నం లోవరాజు పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులకు సత్కారం



సత్కారం పొందిన ఉపాధ్యాయులు

అచ్యుతాపురం(అనకాపల్లి): మండలంలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు మంగళవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో సన్మానించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు స్థానిక పేరెంట్స్ కమిటీ సాయంతో కృషి చేయాలని సబ్బవరపు నూకరాజు అన్నారు. ఎంఈఓ దేవరాయలు చేతుల మీదుగా ఎస్.శ్రీనివాస్‌రాజు, సత్యనారాయణ, పి.రేఖ, కుమారి, జి.శాంతిలను సత్కరించారు.

మహోన్నతమైనది ఉపాధ్యాయ వృత్తి



నక్కపల్లి : జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సత్యదేవ శర్మను సన్మానిస్తున్న దృశ్యం



పాయకరావుపేట గ్రంథాలయంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పాఠకులు



కె.వెంకటాపురంలో హెచ్ఎం సన్మానం



పి.ధర్మవరంలో ఉపాధ్యాయులకు సత్కారం

పాయకరావుపేట : ఉపాధ్యాయ వృత్తి ఎంతో మహోన్నతమైనదని, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే అని, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు చిక్కాల రామారావు అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పెంటకోట గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను ఆయన ఘనంగా సన్మానించారు. జెడ్పీ పాఠశాలలో 15 మంది ఉపాధ్యాయులకు సాలువాలు వేసి, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఉపాధ్యాయులు చేస్తున్న సేవలను కొనియాడారు. ఉపాధ్యాయులు విద్యార్థులను డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, శాస్త్రవేత్తలుగా, న్యాయవాదులుగా, ఉత్తమ పౌరులుగా, దేశానికి సేవ చేసే పౌరులుగా దీర్చిదిద్దుతున్నారన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చేపల నాగమణి, తాతాజీ, ఉప సర్పంచ్ చిక్కాల సూర్యానారాయణ, పాయకరావుపేట పీఏసీఎస్ చైర్మన్ దేవవరపు రాజేష్ ఖన్నా, ఉపాధ్యాయులు సూర్యనారాయణ, ఉమామహేశ్వరరావు, తాతారావు, పాఠశాల చైర్మన్లు పాల్గొన్నారు.

మునగపాక : ఉపాధ్యాయ వృత్తి ఎంతో కీలకమైందని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దాసరి అప్పారావు అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని మంగళవారం మండల వ్యాప్తంగా ప్రభుత్వ,ప్రయివేటు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. నాగవరం పాఠశాలలో జరిగిన వేడుకల్లో అప్పారావు మాట్లాడుతూ ఎంతోమంది విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చి దిద్దే అవకాశం ఉపాధ్యాయులకే ఉంటుందన్నారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేయడం వల్ల మంచి ఫలితాలు అందుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ ఉపాధ్యాయులను గౌరవించాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నాయుడు,పాలసంఘ అధ్యక్షుడు గనిశెట్టి వెంకటరావు పాల్గొన్నారు.

యలమంచిలి : సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని భావి భారత పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయుడేనని పేట బయ్యవరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి అన్నారు. పేట బయ్యవరం గ్రామంలో ఎంపీయూపీ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణలో అలరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బోద్దేడ సత్యనారాయణ, పీలా రవీంద్ర, కె.వీరభద్రరావు, ధనలక్ష్మి, కృష్ణవేణి, శ్రీనుబాబు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో సర్వేపల్లికి నివాళి

పాయకరావుపేట : గురుపూజోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. గ్రంథాలయాధికారి వామాల లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు టి.వెంకటేశ్వరరరావు, ఎస్.సీతారామయ్య, ఎ.అచ్యుతరావు, సీతారామమూర్తి పాల్గొన్నారు.

కోటవురట్ల: పాములవాక, కె.వెంకటాపురం జెడ్పీ హైస్కూళ్లలోను, రాజుపేట ఎంపీయూపీ స్కూల్, గొల్లపేట ఎంపీపీ స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులకు క్యారమ్స్, టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించారు. కె.వెంకటాపురంలో ఉపాధ్యాయులను వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్ ఘనంగా సత్కరించారు. ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ, షేక్ అల్లాఉద్దీన్, షేక్ ఖాలీషా, జీవన్‌లను ఘనంగా సత్కరించారు. పాములవాక జెడ్పీ హైస్కూల్లో విద్యార్థుల కోలాటం కనువిందు చేసింది.

ఎస్.రాయవరం: పి.ధర్మవరం జిల్లా పరిషత్ పాఠశాలలో డాక్టర్ శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఉపాధ్యాయులను దుశ్శాలువాలతో సత్కరించారు. వమ్మవరం పాఠశాలలో ఉపాధ్యాయులకు క్రీడలు నిర్వహించి బహుమతులు అందజేశారు. గుడివాడ, పెదఉప్పలం, ఎస్.రాయవరం తదితర పాఠశాలలో గురుపూజోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

భవిష్యత్‌ను తీర్చిదిద్దేది గురువులే..

నక్కపల్లి: విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దేది గురువులేనని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత శ్రీపాద సత్యదేవ శర్మ, నక్కపల్లి ఎంఈవో కుంచం నరేష్ అన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా మంగళవారం నక్కపల్లి, పెద బోదిగల్లం ఉన్నత పాఠశాలల్లో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయ వృత్తి నుంచి దేశంలో అత్యున్నత పదవిని అలంకరించిన సర్వేపల్లి రాధాకృష్ణ ఉపాధ్యాయ లోకానికే అదర్శనీయమన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో కుంచం నరేష్‌ను, పదవీ విరమణ చేసిన శ్రీపాద సత్యదేవ శర్మను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు రాణి లలిత, ఉపాధ్యాయులు ఆచార్యులు, ఎ.వి.ఎల్ కుమారి, చిన్నారావు, ఫల్గుణరావు, టి.వి.రమణ, సత్యవతి, శ్రీదేవి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సర్వేపల్లికి నివాళులర్పిస్తున్న టీచర్లు, విద్యార్థులు



టీచర్లను సత్కరించిన వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి అప్పారావు



పెంటకోట పాఠశాలలో ఉపాధ్యాయులకు సన్మానం

ఈ-పంట నమోదు తప్పక చేసుకోవాలి



ఈ-పంట నమోదు పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ రామారావు

మునగపాక : ప్రతి రైతు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలని అనకాపల్లి వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.రామారావు కోరారు. మునగపాకలో ఆయన మంగళవారం ఈ-పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పంట నమోదు వల్ల ఎన్నో లాభాలున్నాయని, కొన్ని పరిస్థితుల్లో పంటలకు నష్టం వాటిల్లినపుడు ప్రభుత్వం నుంచి పరిహారం అందుతుందని తెలిపారు. వరిసాగులో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వరి ఉడుపుల సమయంలో నారు చివర్లను కత్తిరించేలా చూడాలన్నారు. తద్వారా తెగుళ్లకు దూరంగా ఉండవచ్చన్నారు. సీజన్‌లో రైతులకు అవసరమయ్యే విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచామన్నారు. మండల వ్యవసాయాధికారి సీహెచ్ జ్యోత్స్నకుమారి, వీఏఏ సింధూ, వీహెచ్ఏ భాను, రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వికలాంగ ఆశ్రమ సిబ్బందికి సత్కారం



ఆశ్రమ సిబ్బందిని సత్కరిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం ఇంటిగ్రేటెడ్ వికలాంగుల ఆశ్రమ పాఠశాలలో మంగళవారం మదర్ థెరిస్సా వెల్ఫేర్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు పుస్తకాలు, దుప్పట్లు, చాపలు అందజేశారు. వికలాంగుల ఆశ్రమ పాఠశాల సిబ్బంది, స్టాఫ్‌ను సత్కరించారు.

జగనన్న పాల వెల్లువతో పాడి రైతుకు భరోసా



చినబొడ్డేపల్లిలో మాట్లాడుతున్న సర్పంచ్ శివరామ్



మూలపేటలో రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న సర్పంచ్ గంగప్పలనాయుడు

కోటవురట్ల : జగనన్న పాల వెల్లువ పాడి రైతుకు ఆర్థిక ఆసరా అవుతుందని సర్పంచ్ పైల శివరామ్ అన్నారు. చినబొడ్డేపల్లిలో పాడి రైతులతో అమూల్ కంపెనీ సిబ్బంది మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతు సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. పాడి రైతుకు కూడా అండగా ఉండాలన్న లక్ష్యంతో అమూల్ కంపెనీతో ఒప్పందం కుదిర్చారన్నారు. అంతర్జాతీయ స్థాయిలోనే అమూల్ కంపెనీ 8వ స్థానంలో ఉందని, కంపెనీకి పాలను సరఫరా చేసి ఆర్థికంగా నిలదొక్కుకోవాలని కోరారు.

మునగపాక: రైతులు అమూల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మూలపేట సర్పంచ్ బీశెట్టి గంగప్పలనాయుడు కోరారు. మూలపేటలో మంగళవారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జగనన్న పాలవెల్లువ సదస్సు నిర్వహించారు. గంగప్పలనాయుడు మాట్లాడుతూ తక్కువ వడ్డీకే పాడి పశువుల కొనుగోలుకు రుణ సదుపాయం కల్పిస్తున్నారన్నారు. పశు వైద్యాధికారి లావేటి ప్రదీప్‌కుమార్,నాగులాపల్లి పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ఇంటింటా సంక్షేమం

ఎస్.రాయవరం : ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు కొనియాడారు. మండల కేంద్రంలో మంగళవారం నాలుగో రోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. శివారు గ్రామం అగ్రహారానికి రోడ్డు వేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యేను గ్రామస్తులు కోరగా ప్రతిపాదనల మేరకు నిధులు విడుదల కాగానే మంజూరు చేయిస్తామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికి అందుతున్నాయని, శివారులో ఉన్న తమకు కూడా తెలియకపోయినా గ్రామ వలంటీర్లు ఇంటికి వచ్చి మరీ గుర్తు చేస్తున్నారని ప్రజలు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి, స్థానిక వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు, జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, సర్పంచ్ భూపతి అప్పారావు, మాజీ సర్పంచ్ లక్కోజు ఆదిమూర్తి, జిల్లా కమిటీ మెంబర్ మాజీ జెడ్పీటీసీ కశింకోట నీలేంద్రరావు అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్.రాయవరంలో గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే బాబూరావు తదితరులు

'నా మట్టి - నా దేశం' చురుగ్గా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సన్యాసినాయుడు



రాంబిల్లిలో మట్టి సేకరిస్తున్న కారె రాముడు

అచ్యుతాపురం(అనకాపల్లి): యలమంచిలి నియోజకవర్గంలో నా మట్టి - నా దేశం కార్యక్రమం చురుగ్గా నిర్వహించాలని బీజేపీ నియోజక వర్గ కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు పిలుపునిచ్చారు. అచ్యుతాపురం మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన నియోజక వర్గంలోని పార్టీ నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పిలుపు మేరకు ప్రతి బీజేపీ కార్యకర్త ఇంటింటికీ వెళ్లి స్పూన్‌తో మట్టిని సేకరించి ఢిల్లీలోని పార్లమెంటు ఉద్యానవనానికి తరలిస్తామన్నారు. భక్త సాయిరాం, రాజాన రాజు, కాసుబాబు, పల్లి రాజుబాబు, శ్రీరాములు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో 'నా మట్టి నా దేశం'

రాంబిల్లి : మండలంలో మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో నా మట్టి నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు కారె రాముడు మాట్లాడుతూ దేశంలో ప్రధాని మోదీ భిన్నత్వంలో ఏకత్వం నినాదంతో పాలన సాగిస్తున్నారన్నారు. గ్రామాల్లో మట్టిని సేకరించి ఢిల్లీకి పంపుతామన్నారు.

ఇచ్ఛా ఫౌండేషన్‌కు ఏపీటీఎఫ్ వితరణ

అచ్యుతాపురం(అనకాపల్లి): కొండకర్ల ఇచ్ఛా ఫౌండేషన్‌కు ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో 25 కేజీల బియ్యం, 5 కేజీల కందిపప్పు అందజేశారు. పిల్లల సమక్షంలో కేక్ కట్ చేసి సర్వేపల్లి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు పట్నాల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నరసింహమూర్తి, జిల్లా కౌన్సిలర్ వెంకటేశ్వరరావు,శ్రీనివాసరావు,కన్నారావు, కృష్ణ, ప్రోత్సాహిని, రామశర్మ, అప్పలనాయుడు, గీత, జ్యోతి పాల్గొన్నారు.

ఉత్తమ గురువులకు పురస్కారం













కలెక్టర్ చేతులు మీదుగా అవార్డు అందుకుంటున్న అప్పలరాజు, భవానీ, వనజ, గారా రమేష్ (దార్లపూడి ఉన్నత పాఠశాల), బాలరామహేశ్వరి (గుడివాడ ఉన్నత పాఠశాల), లెక్కల గౌరి (రేవుపోలవరం ఉన్నత పాఠశాల), బి.రామచంద్రరావు (వేమగిరి ఎంపీయూపీ పాఠశాల), బుద్ద రామప్పారావు (వాడ్రాపల్లి జెడ్పీ హైస్కూల్)

నక్కపల్లి: విద్యార్థులకు చక్కని బోధన అందించిన గురువులను ప్రభుత్వం గురు పూజోత్సవం సందర్భంగా మంగళవారం ఘనంగా సత్కరించింది. జిల్లా స్థాయి అవార్డులకు నక్కపల్లి మండలం నుంచి నలుగురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. వీరిని విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్, డీఈవో, ఉన్నతాధికారులు ఘనంగా సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేసారు. నక్కపల్లి మండలం నుంచి చొక్కా అప్పలరాజు, సిహెచ్.సత్యనారాయణ, భవానీ, వనజలు జిల్లా స్థాయి అవార్డులకు ఎంపికయ్యారు. వీరు జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో అవార్డులు అందుకున్నారు.

ఎస్.రాయవరం : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా జిల్లా కలెక్టర్ రవిపఠాన్‌శెట్టి, ఎంపీ సత్యవతి చేతుల మీదుగా సత్కరం అందుకుంటున్న మండలంలో పలు పాఠశాలల ఉపాధ్యాయులు వరుసగా...





కె.వి.పురంలో కొత్త పింఛన్ల పంపిణీ



కె.వెంకటాపురంలో పింఛను అందిస్తున్న రమేష్

కోటవురట్ల : ప్రతి కుటుంబానికి సంక్షేమం అందాలన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్ అన్నారు. కె.వెంకటాపురంలో కొత్తగా మంజూరైన పింఛన్లను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పింఛను డబ్బుల కోసం లబ్ధిదారులు పడిగాపులు కాయాల్సి వచ్చేదన్నారు. ఇపుడలా కాదని, దరఖాస్తు చేస్తే అర్హత ఉంటే ఎవరి జోక్యం లేకుండా పింఛను మంజూరవుతోందన్నారు పింఛను డబ్బులను వలంటీర్లు ఒకటో తేదీనే తెల్లవారక ముందే తలుపుతట్టి మరీ అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు రామసత్యనారాయణ పాల్గొన్నారు.

వచ్చే నెల 7న ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల

యలమంచిలి నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జ్ఞానవేణి

అచ్యుతాపురం(అనకాపల్లి): ఓటర్ల జాబితా సవరణలో భాగంగా యలమంచిలి నియోజక వర్గంలో 10,782 క్లెయిమ్‌లు స్వీకరించామని యలమంచిలి నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జ్ఞానవేణి అన్నారు. మంగళవారం అచ్యుతాపురం మండలం రామన్నపాలెంలో ఉన్న నేవల్ బేస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జూలై 21 నుంచి ఆగస్టు 21 వరకూ బీఎల్‌ఓలు, ఎన్నికల సిబ్బంది నియోజక వర్గంలోని 68,607 ఇళ్లకు వెళ్లి 2,05,016 ఓట్లకు సంబంధించి సర్వే చేపట్టామన్నారు. ఈ సర్వేలో పీడబ్ల్యూడీ ఓట్లను 1986గా గుర్తించామన్నారు. ఇంటిగ్రేటెడ్ డ్రాఫ్ట్ జాబితా అక్టోబర్ 17నాటికి తయారు చేస్తామని, అక్టోబర్ 17 నుంచి నవంబర్ 30 వరకూ సదరు డ్రాఫ్ట్ జాబితాలో అభ్యంతరాలను స్వీకరిస్తామని అన్నారు. డిసెంబర్ 26 నాటికి ఆ అభ్యంతరాలను దర్యాప్తు చేస్తామన్నారు. డబుల్ ఎంట్రీలు 4837 క్లయిమ్‌లను రీ-వెరిఫికేషన్ చేసామని, అలాగే సవరణకు సంబంధించిన వివరాలను అక్టోబర్ 17న విడుదల చేసే ఇంటిగ్రేటెడ్ డ్రాఫ్ట్ పబ్లికేషన్‌లో పొందుపర్చుతామని తెలిపారు.



పార్టీల నేతలతో మాట్లాడుతున్న జ్ఞానవేణి

నియోజకవర్గంలో ఓటర్ల సర్వేలో
10,782 క్లెయిమ్‌లు
పీడబ్ల్యూడీ ఓట్లు 1986
డబుల్ ఎంట్రీలు 4,837
నియోజక వర్గంలో 68,607 ఇళ్లల్లో ఓటర్ సర్వే
ప్రస్తుత ఓటర్లు 2,05,016 మంది

కాలువ పూడికతీత పనులు ప్రారంభం

పాయకరావుపేట : మండలంలో గల గుంటపల్లి కాలువ పూడికతీత పనులకు మంగళవారం శ్రీకారం చుట్టారు. తాండవ నది ద్వారా ప్రవహించే సాగు నీరు మంగవరం కాలువ ద్వారా గుంటపల్లి కాలువకు ప్రవహించి రైతులకు సాగునీరు సరఫరా జరుగుతుంది. కాలువ తుప్పలతో కుచించుకుపోవడం కారణంగా పూడికతీత చేపట్టారు. డెక్కన్ ఫైన్ కెమికల్ ఫ్యాక్టరీ పొక్లెయిన్ సహాయంతో పనులు చేపడుతున్నారు. స్థానిక రైతులు శ్రమదానంతో పనులు చేయించుకుంటున్నారు. ఈ కాలువ పూడికతీత వల్ల మంగవరం, గుంటపల్లి గ్రామాల రైతులకు సాగునీరు సరఫరా జరుగుతుంది.

మదర్ థెరిస్సా ఆశయ సాధనకు పాటుపడాలి



మదర్ థెరిసా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక : ప్రపంచ మానవాళికి మదర్ థెరిసా అందించిన సేవలు అమోఘమని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ కొనియాడారు. మునగపాకలో మదర్‌థెరిసా వెల్ఫేర్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధి కర్రి కిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించిన మదర్ థెరిస్సా వర్ధంతి కార్యక్రమంలో ఆమె విగ్రహానికి ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. మదర్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో మునగపాక ఉత్సవ కమిటీ చైర్మన్ బొడ్డేడ అప్పలనాయుడు, వాడ్రాపల్లి, మూలపేట సర్పంచ్‌లు కాండ్రేగుల నూకరాజు, బీశెట్టి గంగప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నేతలు బొడ్డేడ లక్ష్మీనారాయణ, మళ్ల కృష్ణ, రాజాన బుజ్జి, గంగునాయుడు, వార్డు సభ్యులు దాడి పోలీసు, వేగి కృష్ణ పాల్గొన్నారు.